పేపర్‌లీక్ కేసులో మరో నలుగురు అరెస్ట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టిఎస్‌పిఎస్‌సి ప్రశ్నపత్రం లీకేజీ కేసులో సిట్ దర్యాప్తు కొనసాగుతోంది. ఎఇ సివిల్ మాస్టర్ ప్రశ్నపత్రం పెద్ద ఎత్తున చేతులు మారినట్టు అధికారులు భావిస్తున్నారు. ఇటీవల కీలక నిందితులు రవికిషోర్ అరెస్టుతో నిందితుల వివరాలు బయటకు వచ్చాయి. వరంగల్ విద్యుత్‌శాఖ డిఇతోపాటు మరో నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయిన నిందితులు సురేశ్, రవికిషోర్, దివ్య, విక్రమ్ సైదాబాద్‌లో ఒకే భవన సముదాయంలో నివాసం ఉంటున్నారని పోలీసులు తెలిపారు. సైదాబాద్‌లోని ఒక జిరాక్స్ కేంద్రం నుంచి ప్రశ్నపత్రాలు జిరాక్స్ తీసి విక్రయించినట్టు సిట్ అధికారులు గుర్తించారు. ఆర్‌టిసి క్రాస్‌రోడ్డులోని పలు కోచింగ్ సెంటర్ల వద్ద పేపర్ విక్రయించేందుకు నిందితులు తచ్చాడినట్టు దర్యాప్తులో తేలింది. రవికిశోర్ ఖాతాలో చాలా మందికి సంబంధించిన లావాదేవీలు బయటపడ్డాయి. ఎపి పరీక్షలో పలువురు టాపర్లకు సంబంధించిన వివరాలు రవికిషోర్ బ్యాంకు లావాదేవీల్లో గుర్తించారు. టిఎస్‌పిఎస్‌సి ప్రశ్నపత్రం లీకేజీ కేసులో ఇప్పటి వరకు 43 మందిని సిట్ అరెస్టు చేసింది. అరెస్టుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని సమాచారం.

వడదెబ్బకు వన సేవకుడు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వడదెబ్బకు గురై వన సేవకుడు మృతి చెందిన సంఘటన సూర్యాపేట జిల్లా ఆత్మకూర్ (ఎస్) మండలం నెమ్మికల్‌లో ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నెమ్మికల్‌కు చెందిన ఉపాధి హామీ వనసేవక్ గంపల దేవదాసు (58) రెండేళ్లుగా గ్రామంలోని హరితహారం, పల్లె ప్రకృతివనం మొక్కలకు సేవకునిగా పని చేస్తున్నాడు. కొద్దిరోజులుగా ఎండలో సైతం మొక్కలకు నీళ్ల పోస్తూ.. పనులు చేస్తున్నాడు. దాంతో వడదెబ్బతో రెండు రోజులుగా అస్వస్థతకు గురయ్యాడు. స్థానికంగా చికిత్స తీసుకున్న అతను.. పరిస్థితి విషమించి మృతి చెందాడు. దేవదాసు మృతదేహాన్ని స్థానిక సర్పంచ్ గంపల దావీదు, పంచాయతీ కార్యదర్శి హరికృష్ణ, ఫీల్డ్ అసిస్టెంట్ రాము సందర్శించారు. మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. దేవదాసుకు భార్య, ఒక కూతురు, కుమారుడు ఉన్నారు.

మోండా మార్కెట్ చోరీ మహారాష్ట్ర ముఠా పనే...

- ముంబాయికి ప్రత్యేక పోలీసు బృందాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సికింద్రాబాద్ మార్కెట్ ఠాణా పరిధిలో నిత్యం రద్దీగా ఉండే మోండా మార్కెట్లో పట్టపగలు జరిగిన దోపిడీ సంఘటనను పోలీసులు సవాల్‌గా తీసుకుని దర్యాప్తు చేపట్టారు. శనివారం ఉదయం ఆదాయపన్ను శాఖ (ఐటి) అధికారులమంటూ బంగారం దుకాణంలోకి ప్రవేశించిన దుండగులు పనివాళ్లను గదిలో బంధించి 1,700 గ్రాముల బంగారు బిస్కెట్లతో పారిపోయిన విషయం తెలిసిందే.

నిందితుల కోసం ఐదు ప్రత్యేక బృందాలు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు గాలింపు చేపట్టాయి. నిందితులు మహారాష్ట్రకు చెందిన వారిగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ నేపథ్యంలో కొన్ని బృందాలు మహారాష్ట్ర వెళ్లాయి. చోరీ తర్వాత ఆటోలో జెబిఎస్ వెళ్లిన ముఠా అక్కడి నుంచి కూకట్‌పల్లి వైపు వెళ్లినట్టు సిసి టీవీ ఫుటేజ్‌లో గుర్తించారు. పటాన్‌చెరు మీదుగా మహారాష్ట్ర వెళ్లినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ కేసులో యజమాని మధుకర్‌ను కూడా పోలీసులు విచారిస్తున్నారు.

ప్రజాస్వామ్యాన్ని బిజెపి అపహాస్యం చేస్తోంది

- నూతన పార్లమెంటు భవన ప్రారంభానికి రాష్ట్రపతిని పిలవకపోవడం అవమానకరం
- ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలపై పోరాటాలు ఉధృతం చేయాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నూతన పార్లమెంట్ భవన ప్రారంభానికి రాష్ట్రపతిని పిలవకపోవడం అవమానకరమైన విషయమని, ఎందుకు పిలవలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఖమ్మం జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవన్‌లో ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు గుడవర్తి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సిపిఎం పాలేరు నియోజకవర్గ సమావేశానికి తమ్మినేని వీరభద్రం హాజరై మాట్లాడారు. పార్లమెంట్ భవన్ ప్రారంభంలోనూ ప్రతిపక్షాలకు సరైన ప్రాధాన్యత ఇవ్వలేదని, 19 పార్టీలు బాయ్ కాట్ చేసినా సరే అత్యంత దుర్మార్గంగా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ భవనాన్ని ప్రారంభించడం ఏమిటని ప్రశ్నించారు. బిజెపి ప్రభుత్వం, దాన్ని వెనక నుంచి నడిపిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ ఈ దేశాన్ని మత రాజ్యంగా మార్చేందుకు కుట్రలు చేస్తున్నాయని, అందుకే రాజ్యాంగాన్నీ మార్చే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. అందుకే బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ మతతత్వ విధానాలను వెనక్కి కొట్టేందుకు క్యాడర్ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కర్నాటకలో లాగా దేశం నుంచి కూడా బిజెపిని తరిమేసే సమయం ఆసన్నమైందని, మతోన్మాద రాజకీయాలు ఇక మీదట సాగవని స్పష్టంచేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ, స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపైన పోరాటాలను ఉధృతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. జూన్, జూలై నెలల్లో ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తున్నట్టు తెలియజేశారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండి రమేష్, బుగ్గవీటి సరళ, జిల్లా కమిటీ సభ్యులు షేక్ బషీరుద్దీన్, సుదర్శన్ రెడ్డి, మండల కార్యదర్శులు కొమ్ము శ్రీను, కె.వి.రెడ్డి, నియోజకవర్గ నాయకులు అంగిరేకుల నరసయ్య, రామారావు, తోటకూర రాజు, గంగాధర్, పొన్నెకంటి సంగయ్య, కృష్ణ, నాగేశ్వరరావు, వీరన్న, సురేష్, కట్టెకోల వెంకన్న, తమ్మినేని వెంకట్రావు, రంజాన్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ హక్కుల కోసం కెసిఆర్ ఉద్యమమా?

- వైఎస్ షర్మిల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఢిల్లీ హక్కుల కోసం కేంద్రం మెడలు వంచుతానంటూ సిఎం కెసిఆర్ మాట్లాడడం విడ్డూరంగా ఉందని వైఎస్‌ఆర్‌టిపి అధ్యక్షులు వైఎస్ షర్మిల ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. పక్క రాష్ట్రాల ప్రయోజనాలకోసం పోరాడే కెసిఆర్ స్వరాష్ట్ర ప్రయోజనాలకోసం ఎందుకు పోరాడటం లేదని ప్రశ్నించారు. బయ్యారం ఉక్కు పరిశ్రమ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన యూనివర్సిటీ కోసం పార్లమెంట్‌లో బిఆర్‌ఎస్ ఎంపిలు మాట్లాడకుండా ఉంటున్నారని విమర్శించారు. బిజెపి ఇస్తానన్న రెండు కోట్ల ఉద్యోగాల గురించి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ప్రాజెక్టులకు జాతీయ హోదా తీసుకురావడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని పేర్కొన్నారు.

నర్సింగ్ విద్యలో అబ్బాయిలకు అవకాశం కల్పించాలి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నర్సింగ్ విద్యనభ్యసించేందుకు అబ్బాయిలకూ అవకాశం కల్పించాలని తెలంగాణ ఫ్లోరెన్స్ నర్సింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నక్క సూర్య కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏ కోర్సులో లేని వివక్షను నర్సింగ్ కోర్సుల్లో చూపిస్తున్నారని విమర్శించారు. హాస్టల్ లేదనే కారణంతో అడ్మిషన్లు నిరాకరిస్తే పేద అబ్బాయిలు ప్రయివేటులో చదవలేక నర్సింగ్ విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అబ్బాయిలకు ప్రవేశం కల్పించాలని 2005లోనే ఉత్తర్వులిచ్చినప్పటికీ ఇప్పటికీ అమలు చేయకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

తెలంగాణలో త్వరలో బిజెపి దుకాణం బంద్

- కాంగ్రెస్ పార్టీకి అభ్యర్థులు కరువు
- బిఆర్‌ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి హరీశ్ రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో త్వరలో బిజెపి దుకాణం బంద్ అయితదని ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్ పార్టీకి 40-50 స్థానాల్లో అభ్యర్థులు కరువయ్యారని తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రెండు వేల పింఛన్ బంద్ అవుతుందన్నారు. ఆదివారం కామారెడ్డి జిల్లా లింగంపేట్ మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనానికి హరీశ్‌రావు హాజరయ్యారు. మండల కేంద్రంలోని శెట్పల్లి చౌరస్తా నుంచి వందలాది మంది బైక్ ర్యాలీతో మంత్రికి బిఆర్‌ఎస్ కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. అనంతరం భారీ బైక్ ర్యాలీతో సభా ప్రాంగణానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆసరా పింఛన్లు, కళ్యాణ లక్ష్మి, రైతుబంధు, రైతు బీమా ఆగిపోతాయని అన్నారు. హస్తం అధికారంలోకి వస్తే మళ్లీ పాత రోజులు వస్తాయని, పగటిపూట మూడు గంటలు.. రాత్రి నాలుగు గంటలు కరెంటు వస్తుందని, రాష్ట్రంలో మళ్లీ పైరవీకారులు, అవినీతి అధికారులు వస్తారని అన్నారు. మళ్లీ రైతులు ఎరువు బస్తాలకు క్యూలైన్లు కట్టే రోజులు వస్తాయని చెప్పారు. బిజెపి, కాంగ్రెస్ పార్టీలు ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తూ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని విమర్శించారు. డబుల్ ఇంజన్ అని చెప్పుకునే బిజెపి.. పక్క రాష్ట్రమైన మహారాష్ట్రలోని పూణే, నాగపూర్, సోలాపూర్ ప్రజలకు వారానికోసారి తాగునీరు అందిస్తోందని ఆరోపించారు. మహారాష్ట్రలో తెలంగాణ తరహా పథకాలు అమలు చేయాలని అక్కడ ప్రభుత్వం కమిటీ వేసిందని తెలిపారు. కెసిఆర్ దేశ రాజకీయాల్లో చక్రం తిప్పబోతున్నారని అన్నారు. వడగండ్ల వానకు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10వేల చొప్పున నష్టపరిహారం త్వరలో ఇస్తామని చెప్పారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు త్వరలోనే ప్రారంభిస్తామని, డబుల్ కోటా పెంచేందుకు కృషి చేస్తామని చెప్పారు. త్వరలోనే నియోజకవర్గానికి ముఖ్యమంత్రి కేసీఆర్ వస్తారని, వరాలజల్లు కురిపిస్తారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో బిజెపి పార్టీకి నూకలు చెల్లాయని బిజెపి నాయకులు ఇతర పార్టీల వైపు చూస్తున్నారని అన్నారు.

బిజెపి దాడులకు వ్యతిరేకంగా నేడు, రేపు నిరసనలు

- రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పోతినేని సుదర్శన్, టి సాగర్
- ఇందిరా పార్క్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

త్రిపురలో బిజెపి ప్రభుత్వ దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పోతినేని సుదర్శన్, టి సాగర్ పిలుపునిచ్చారు. త్రిపురలో రైతు సంఘం కార్యకర్తలు, సభ్యులు, ప్రజలపై బిజెపి దుండగులు సాగిస్తున్న ఆటవిక హింసాకాండ పట్ల రైతు సంఘం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తూ ఆదివారం హైదరాబాద్‌లోని దోమలగుడ నుంచి ఇందిరాపార్క్ వరకు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం పోతినేని సుదర్శన్ మాట్లాడుతూ.. త్రిపురలో ఎన్నికల అనంతరం బిజెపి సాగిస్తున్న ఆటవిక హింసాకాండను తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని ఈ హింసను తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు.

బిజెపి చేసిన దాడుల్లో ఇప్పటివరకు ఐదుగురు మరణించారని, 630 మంది గాయపడ్డారని తెలిపారు. 85 ఇండ్లు దగ్ధం కాగా 65 పాక్షికంగా దగ్ధమయ్యాయని, 96 దుకాణాలు దగ్ధమయ్యాయని చెప్పారు. ఇక 1,647 ఇండ్లను ధ్వంసం చేసి దోచుకున్నారని, వెయ్యి ఎకరాలకు పైగా ఉన్న 211 రబ్బరు తోటలు దగ్ధమయ్యాయని తెలిపారు. దాదాపు 500 ఎకరాల్లోని 286 కూరగాయల తోటలు ధ్వంసం, 60 చేపల చెరువులు విషపూరితమయ్యాయని, 15 మేకలు, 10 ఆవులు, 50 బాతులు, కోళ్ల కాలి బూడిదయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. త్రిపురలో శాంతిని నెలకొల్పేందుకు తక్షణమే జోక్యం చేసుకోవాలని ఎన్నికల కమిషన్‌ను కోరారు. అలాగే ఈ హింసకు బాధ్యులైన వారందరిని అరెస్టు చేసి, ప్రజల జీవితాలకు, వారి జీవనోపాధులకు భద్రత కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని త్రిపుర చీఫ్ సెక్రటరీని, పోలీసు యంత్రాంగాన్ని డిమాండ్ చేశారు. అనంతరం సాగర్ మాట్లాడుతూ.. త్రిపురలో ఈ తరహా నిరంకుశవాదం, అప్రజాస్వామికవాదం, అమానవీయ ప్రవర్తనాశైలిని ఏ మాత్రమూ సహించలేమన్నారు. అతి స్వల్ప మెజారిటీతో గెలుపొందడం, పైగా తన ఓటు బ్యాంక్ క్షీణించడం వంటి కారణాలు బిజెపి నేతలను తీవ్ర నిరాశపరిచాయని, ఆ నిరాశా నిస్పృహలతోనే వారు ఈ ఆటవిక దాడులకు తెగబడ్డారని తెలిపారు. ఈ దాడులకు వ్యతిరేకంగా ఈ నెల 29, 30 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు తెలపాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు నంద్యాల నరసింహారెడ్డి, బొంతల చంద్రా రెడ్డి, పి జంగారెడ్డి, బుర్రి శ్రీరాములు, వీరేపల్లి వెంకటేశ్వర్లు, శెట్టి వెంకన్న, బస్సు మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్, కందాల ప్రమీల, కున్‌రెడ్డి నాగిరెడ్డి, మాటూరు బాలరాజు గౌడ్, ఈసంపల్లి బాబు, ఎం శ్రీనివాసులు, వాసుదేవరెడ్డి, అంజిలయ్య గౌడ్, తిరుపతి రెడ్డి, రాజయ్య, అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుడిసెల పోరు ఉధృతం

- పేదలకు అండగా సిపిఎం, ప్రజాసంఘాలు
- ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వజాగాల్లో ఉద్యమం
- పలుచోట్ల పక్కా ఇళ్ల నిర్మాణం, కాలనీల ఏర్పాటు
- పోలీసు బలగాలతో గుడిసెల కూల్చివేత
- అయినా వెనక్కి తగ్గని పేదలు
- 'జాగా వచ్చుడో.. మేం సచ్చుడో' నినాదంతో పోరాటం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కూడు, గూడు, గుడ్డ మనిషి కనీస అవసరాలు. కానీ రాష్ట్రంలో పేదల జీవితాలు గూడు లేని పక్షుల వలె చిన్నాభిన్నం అవుతున్నాయి. పల్లె విధ్వంసంతో పట్నాల బాట పట్టిన పేదలది మరీ దయనీయ దుస్థితి. గూడు లేక నానా అవస్థలు పడుతున్న పేదలు తమకు ఇంటి జాగాలు ఇవ్వాలని గతంలోనూ, ప్రస్తుతమూ ప్రభుత్వాలకు మొర పెట్టుకున్నారు. పెత్తందారులకు, రియల్ ఎస్టేట్‌దారులకు అండగా నిలిచిన పాలకులు పేదల సమస్యను పెడచెవిన పెట్టారు. దీంతో ఎర్రజెండా అండతో ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్నారు. ఉద్యమాన్ని కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం ఉక్కుపాదం మోపినా, పోలీసులను ఊసిగొల్పి బుల్ డోజర్లతో గుడిసెలను తొలగించే ప్రయత్నం చేసినా కుట్రలు పన్ని స్థలాల నుంచి తరిమేందుకు దౌర్జన్యానికి పాల్పడుతున్నా పేదలు వెనక్కి తగ్గలేదు. 'జాగా వచ్చుడో.. మేం సచ్చుడో' అనే నినాదంతో పోరును మరింత తీవ్రతరం చేశారు. ఎర్రజెండా అండతో లక్ష్యాన్ని సాధించి తీరుతామని నమ్మకం వారిలో బలంగా ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఇళ్ల స్థలాల కోసం రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న గుడిసెల పోరాటంపై ప్రత్యేక కథనం.

ఇల్లు లేని నిరుపేదలు రాష్ట్ర వ్యాప్తంగా సర్కారు జాగాల్లో గుడిసెలు వేసి పోరు సాగిస్తున్నారు. ఈ పోరులో రాష్ట్ర వ్యాప్తంగా 51 కేంద్రాలు 850 ఎకరాల్లో సుమారు 40 వేల కుటుంబాలు ఉన్నాయి. ఇంకా కొత్తగా ప్రభుత్వ జాగాల్లో గుడిసులు వేసుకునేందుకు పేదలు సిద్ధమవుతున్నారు. వారికి అండగా సిపిఎం, వ్యవసాయకార్మికసంఘం, ఇతర ప్రజాసంఘాలు అండగా నిలిచాయి. పోరాటంలో భాగస్వాములయ్యాయి. రంగారెడ్డి జిల్లాలోని అబ్దులాపూర్‌మెట్ రెవెన్యూ పరిధిలో సుమారు వంద ఎకరాల భూదాన్ భూముల్లో పేదలు 18 వేల గుడిసెలు వేశారు. ఇక్కడ సుమారు 30 వేల మంది నివాసం ఉంటున్నారు. వీరిని ఖాళీ చేయించేందుకు తాగునీరు అందకుండా ప్రభుత్వం నిర్బంధాలు ప్రయోగించింది. తాగునీరు ఇచ్చే వారిపై కేసులు పెడుతామని బెదిరింపులకు దిగుతోంది. మహిళలు ఆరుబయటికి కిలోమీటర్ల దూరం వెళ్లాల్సిన పరిస్థితి. ఇంటి జాగా సాధించే వరకూ పోరాడుతూనే ఉంటామని గుడిసెవాసులు ప్రతినబూనారు.

జగిత్యాల జిల్లా కోరుట్ల ప్రాంతంలో సుమారు పది వేల మంది ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్నారు. ఖరీదైన జాగా పేదలకు దక్కొద్దన్న దురుద్దేశంతో స్థానిక ప్రజాప్రతినిధుల అనుచరులు పలుమార్లు గుడిసెలపై దాడులు చేశారు. పోలీసు బలగాలతో గుడిసెలు తొలగించినప్పటికీ అక్కడ గుడిసెవాసులు పట్టు వీడలేదు. ప్రాణాలు పోయినా పర్వాలేదు.. ఇక్కడ నుంచి కదిలేది లేదని తెగేసి చెప్పారు. ఉమ్మడి వరంగల్ జిల్లా జక్కలొద్దిలో సర్కారు భూమిలో సుమారు పది వేల గుడిసెలు వేసి ఏకంగా ఆ ప్రాంతానికి సిపిఎం ఆధ్వర్యంలో ప్రగతినగర్ అని నామకరణం చేశారు. హన్మకొండ జిల్లా ఎల్కుర్తి, సంగారెడ్డి జిల్లా కంది, జగిత్యాల కోర్టు ప్రాంతం, చెన్నూరు, పెద్దపల్లి, రామగుండం, మహబూబాబాద్ ఇలా రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 51 కేంద్రాల్లో గుడిసెలు వేసుకున్నారు. ఆ ప్రాంతాల్లోనూ పోలీసులు లాఠీలు ప్రయోగించినా వారిని ఏమీ చేయలేకపోయాయి.

బతుకంతా వీధుల్లోనే ..

గుడిసెల పోరాటం చేస్తున్న వారిలో కడు పేదరికాన్ని అనుభవిస్తూ అర్ధాకాలితో అలమటిస్తున్న అసంఘటిత కార్మిక కుటుంబాలే ఎక్కువగా ఉన్నాయి. పట్టణాలకు వలస వచ్చిన కార్మికుల బతుకంతా వీధి గుడిసెల్లోనే కొనసాగుతోంది. 'నా 70 ఏళ్ల జీవితంలో నేను చేసిన కష్టం పిల్లలను సాకడానికే సరిపోయింది. నాకు ముగ్గురు బిడ్డలు, ఒక కొడుకు. నేను బొంతలు కుడితే వచ్చే ఆదాయంతో పిల్లలకు సరిగ్గా తిండిపెట్టలేని జీవితాన్ని గడిపాను. ఇలాంటి పరిస్థితిలో గూడు కట్టుకునే పరిస్థితి ఎక్కడిది. ఏ ప్రభుత్వం గుంటేడు జాగా ఇచ్చింది లేదు. ఇంటి అద్దె చెల్లించలేక గిప్పుడు ఎర్రజెండోల్లు పేదోల్లకు గుడిసెలు ఇవ్వాలని చేస్తున్న పోరాటంలో ఇక్కడ గుడిసె వేసుకున్నా. నాలుగు నెలలుగా ఈ గుడిసెల్లో ఉంటూ బొంతలు కుడుతూ జీవనం సాగిస్తున్నా. ప్రభుత్వం మా పేదోళ్ల గోస చూసైనా మా గుడిసె జాగాలకు పట్టాలు ఇవ్వాలి' అని బక్కయ్య వేడుకుంటున్నారు. ఇది కేవలం బక్కయ్య పరిస్థితే కాదు గుడిసెలు వేసుకున్న అందరి పరిస్థితి ఇలాగే ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం తమపై దయ చూపి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని గుడిసెవాసులు కోరుతున్నారు.

గిరిజనులకు పది శాతం రిజర్వేషన్లు కేంద్రం అమలు చేయాలి

- మంత్రి సత్యవతి రాథోడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రానికి గిరిజనులపై ప్రేమ ఉంటే తెలంగాణ మాదిరిగా దేశంలో పది శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ డిమాండ్ చేశారు. ఎస్టీలు మాట్లాడే గోర్ మాటి భాషను 8వ షెడ్యూల్లో చేర్చాలని కోరారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ విశ్వేశ్వరయ్య భవన్‌లో జరిగిన జాతీయ బంజారా మీట్ 2023 కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో గిరిజనులకు స్వర్ణయుగం వచ్చిందని చెప్పారు. వారిపై కేంద్రం చిన్నచూపు చూస్తోందని ఆరోపించారు. ఢిల్లీలో కూడా సేవాలాల్ భవనాన్ని నిర్మించాలని డిమాండ్ చేశారు. సేవాలాల్ జయంతిని దేశవ్యాప్తంగా అధికారికంగా జరిపించాలని విజ్ఞప్తి చేశారు. వచ్చే నెలలో పోడు భూములకు పట్టాలు అందిస్తున్నామన్నారు.

రాష్ట్రంలో 3,144 తండాలను గ్రామ పంచాయతీలుగా చేయడంతో పాటు, రూ. రెండు వేల కోట్లతో గిరిజన ఆవాసాలకు రోడ్లు వేయించిన ఘనత సిఎం కెసిఆర్‌కే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో గిరిజనులకు పది శాతం రిజర్వేషన్ల అమలుతో విద్య, ఉద్యోగ అవకాశాలు పెరిగాయని తెలిపారు. వీటితో పాటు మెడికల్, ఇంజినీరింగ్ సీట్లు అదనంగా వచ్చాయన్నారు. బిజెపి గిరిజనుల కోసం ఏం చేసిందో చెప్పాలన్నారు. ఈ సమావేశంలో 15 రాష్ట్రాల ప్రతినిధులు , ట్రై కార్ చైర్మెన్ రామచంద్రునాయక్, జిసిసి చైర్మెన్ వాల్యానాయక్, మాజీ ఎంపి సీతారాం నాయక్, అఖిలభారత బంజారా జాయింట్ యాక్షన్ కమిటీ ప్రెసిడెంట్ సింపల్ బాయ్ రాథోడ్, రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ చైర్మెన్ ప్రొఫెసర్ బి రమణ నాయక్ , కో-చైర్మెన్ రాంబాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బంజారాల అభివృద్ధికి 14 తీర్మానాలకు ఆమోదం తెలిపారు.

మండుతున్న ఎండలు

- నిడమనూరులో 46.1 డిగ్రీల టెంపరేచర్
- చాలా జిల్లాల్లో 45 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- రెడ్ అలర్ట్ జాబితాలో పలు జిల్లాలు
- వచ్చే వారం పాటు ఇదే పరిస్థితి!

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భానుడు తన విశ్వరూపం చూపిస్తుండటంతో 'ఒకటే ఎండ..ఒకటే ఉక్కపోత..అడుగు తీసి అడుగు బయట పెట్టాలంటే వణుకే.. బయటకెళ్లొద్దు..ప్రాణం మీదకు తెచ్చుకోవద్దు' అన్నట్టుగా పరిస్థితి ఉంది. చిన్నపనిమీద బయటికెళ్లి ఇంటికొచ్చేసరికి ప్రాణం కిందమీదవుతూ..ఏం ఎండలు రా బాబోయ్ అని అనలేకుండా ఉండలేని స్థితి వచ్చింది. ఈ వారంలో ఎండలు మరింత పెరిగే అవకాశముందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో బీఅలర్ట్‌గా ఉండాల్సిందే. వరుసగా రెండోరోజూ నల్లగొండ జిల్లాలో ఉష్ణోగ్రత 46 డిగ్రీలకుపైగా నమోదైంది. ఆదివారం నాడు నల్లగొండ జిల్లా నిడమనూరులో అత్యధికంగా 46.1 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత రికార్డయింది. చాలా ప్రాంతాల్లో ఆదివారం 45 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అయితే, తీవ్ర ఎండ, ఉక్కపోతతో చూపెడుతున్న దాని కంటే ఉష్ణోగ్రతలు ఒకటెండ్రు డిగ్రీలు అధికంగానే నమోదవుతున్నాయనే భావన కలుగుతోంది. రెడ్ అలర్ట్ జోన్‌లో నల్లగొండ, మహబూబాబాద్, కరీంనగర్, పెద్దపల్లి, ములుగు, ఖమ్మం జిల్లాలున్నాయి. అయితే, ఆదివారం రాష్ట్రంలో ఆయా జిల్లాల్లో అక్కడక్కడా వర్షం పడింది. ఆదివారం రాత్రి పది గంటల వరకు 39 ప్రాంతాల్లో వర్షపాతం నమోదైనట్టు టిఎస్‌డిపిఎస్ తెలిపింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేటలో, కొమ్రంభీమ్ అసిఫాబాద్ జిల్లా వాంకిడిలో అత్యధికంగా 2.5 సెంటీమీటర్ల చొప్పున వర్షం కురిసింది. మిగతా ప్రాంతాల్లో తేలికపాటి వాన పడింది.

నీట్‌పై బాలికలకు ఉచిత అవగాహనా తరగతులు

- పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నీట్‌పై బాలికలకు ఉచిత అవగాహన తరగతులను నిర్వహించనున్నట్టు మెటామైండ్ అకాడమీ డైరెక్టర్ మనోజ్ కుమార్ తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్ ను ఆదివారం చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డితో కలిసి ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మనోజ్ కుమార్ మాట్లాడుతూ జూన్ 3, 4, 5 తేదీల్లో మూడు రోజు పాటు హైదరాబాద్ దోమలగూడలోని మెటామైండ్ నీట్ అకాడమీలో తరగతులుంటాయని తెలిపారు. బాలికల కోసం ఉచిత హాస్టల్ వసతితో 120 మందికి నీట్ సాధనలో ఎదురయ్యే సవాళ్లు, మెటార్‌షిప్, టెస్ట్ సిరీస్, తదితర నూతన ప్రిపరేషన్ విధానం ద్వారా నీట్‌లో విజయం ఎలా సాధించవచ్చో వివరిస్తామని చెప్పారు. మరిన్ని వివరాలకు 85229 58575లో సంప్రదించాలని సూచించారు.

PRAJAY
Prajay Engineers Syndicate Ltd.
CIN:L45200TG1994PLC017384
Regd. Office: 1-10-63 & 64, 5th Floor, Prajay Coroporate House, Chikoti Gardens, Begumpet, Hyderabad, Telangana 500016, India, Phone : 04066285566, Email : pesl.cs@prajayengineers.com, investorrelations@prajayengineers.com
website: www.prajayengineers.com

STATEMENT OF STANDALONE AND CONSOLIDATED AUDITED FINANCIAL RESULTS FOR THE QUARTER AND YEAR ENDED MARCH 31, 2023

(Rs. in Lakhs)

S. No.	Particulars	Standalone			Consolidated		
		3 Months ended 31.03.2023	Corresponding 3 Months ended 31.03.2022	Year to date Figures for the current Year ended 31.03.2023	3 Months Ended 31.03.2023	For the Year ended 31.03.2023	For the year ended 31.03.2022
		Audited	Audited	Audited	Audited	Audited	Audited
1.	Total Income from Operations	1,157.99	5,356.37	2,982.78	1,157.99	2,982.78	9,304.97
2.	Net Profit / (Loss) for the period (before Tax, Exceptional and / or Extraordinary items)	85.77	(79.25)	(728.21)	48.05	(912.51)	(188.49)
3.	Net Proft / (Loss) for the period before tax (after Exceptional and / or Extraordinary items)	85.77	(79.25)	(728.21)	48.05	(912.51)	(188.49)
4.	Net Profit / (Loss) for the period after Tax (after Exceptional and / or Extraordinary items)	79.29	(86.85)	(756.98)	41.31	(942.31)	(278.84)
5.	Total Comprehensive income for the period [Comprising profit / (loss) for the period (after tax) and other Comprehensive income (after tax)	78.58	(87.02)	(756.63)	40.60	(941.96)	(248.67)
6.	Paid up equity Share Capital (face value of Rs. 10/- each)	6993.58	6993.58	6993.58	6993.58	6993.58	6993.58
7.	Reserves (excluding Revaluation Reserve) as shown in the Audited Balance			48,935.17		48,649.74	49,714.54
8.	Earnings Per Share (of Rs. 10/- each) (for continuing and discontinued Operations 1. Basic (Rs.)	0.12	(0.13)	(1.08)	0.06	(1.35)	(0.36)
	2. Diluted (Rs.)	0.12	(0.13)	(1.08)	0.06	(1.35)	(0.36)

Notes: The above is the an extract of the detailed format of Financial Results filed with the Stock Exchanges under Regulation 33 of SEBI(Listing Obligations and Disclosure Requirements) Regulations, 2015. The full format of the said Results are available on the Stock Exchanes websites at www.bseindia.com, www.nseindia.com, and also on the Company's website www.prajayengineers.com. The above financials have been reveiwed and recommended by the Audit Committe and ahve been approved and taken on record by the Board of Directors at its meeting held on 27-05-2023

For Prajay Engineers Syndicate Limited

Place: Hyderabad
Date: 27 May, 2023

Sd/-
D. Rohit Reddy
Managing Director,
Din:07560450

గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి చెందిన సంఘటన రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో శివరాంపల్లి వద్ద ఓ మహిళ (52) రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఆమెను ఢీకొట్టింది. మహిళ తలపై నుంచి వాహనం వెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. స్థానికులు ఎవరూ ఆ మహిళను గుర్తించకపోవడంతో కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సమీపంలోని సిసి కెమెరాలు ఆధారంగా మహిళను ఢీకొట్టిన వాహన సమాచారాన్ని పోలీసులు సేకరిస్తున్నారు.

క్రైస్తవులు అన్ని రంగాల్లో రాణించాలి

- తెలంగాణ ఫుడ్స్ చైర్మన్ రాజీవ్ సాగర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

సమాజంలో క్రైస్తవులు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అన్ని రంగాల్లో రాణించాలని తెలంగాణ ఫుడ్స్ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్ ఆకాంక్షించారు. సుమారు రూ. 12 కోట్ల ప్రభుత్వ నిధులతో హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్ నగర్‌లోని బాప్టిస్ట్ చర్చిలో చేపట్టిన నిర్మాణ పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రార్థన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు.

చర్చి నిర్మాణానికి ప్రభుత్వం తరపున అన్ని సహాయ సహకారాలు అందేలా కృషి చేస్తానని తెలిపారు. వ్యక్తిగతంగా తన వంతు ఆర్థిక సాయం చేస్తానని పేర్కొన్నారు. క్రైస్తవులు అంటే కేవలం టీచర్లు, నర్సులు, సిస్టర్లకే పరిమితం కాకుండా ఐఎఎస్‌లుగా, ఉన్నతాధికారులుగా, రాజకీయ నాయకులుగా మరింత ఉన్నతులుగా ఎదగాలని కోరారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా కుల మతాలకు అతీతంగా అందరిని ప్రోత్సహిస్తూ వారి అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ ఇశ్రాయిల్ , సీనియర్ పాస్టర్ బోడా సాల్మన్ రాజ్, జూనియర్ పాస్టర్ శాంత్ కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నీతి అయోగ్ సమావేశంతో నేర్చుకునేదేమి లేదు

- ప్రభుత్వ విప్ గొంగిడి సునీత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నీతి అయోగ్ సమావేశంతో కొత్తగా నేర్చుకునేది ఏమి లేదని రాష్ట్ర ప్రభుత్వ విప్ గొంగిడి సునీత అన్నారు. ఆదివారం హైదరాబాద్ బిఆర్‌ఎస్‌ఎల్‌పి కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆ సమావేశానికి పది మంది ముఖ్యమంత్రులు రాలేదన్న విషయాన్ని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలుసుకోవాలని సూచించారు. ఆయన లాంటి నేతలతో రాష్ట్రానికి ఒరిగేదేమి లేదని విమర్శించారు. బిజెపి పాలనలో ధరలు, మతోన్మాదం బాగా పెరిగాయని అన్నారు. ఈ క్రమంలో కిషన్‌రెడ్డికి కెసిఆర్ గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు మాట్లాడుతూ సచివాలయం ప్రారంభోత్సవంపై విమర్శలు చేసిన వారు పార్లమెంటు ప్రారంభోత్సవానికి ఎన్ని పార్టీలు? ఎంత మంది ఎంపీలు వచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. తాము ప్రజా సమస్యల పరిష్కారంలో బిజీగా ఉంటే, బిజెపి నాయకులు సోషల్ మీడియా నిర్వహణలో ఉన్నారని ఎద్దేవా చేశారు.

నేడు ఇందిరాపార్కు వద్ద మహాధర్నా

- భారీగా తరలిరానున్న ఐకెపి విఒఎలు
- రూ.3,900 వేతనంతో బతికేదెలా అంటూ ప్రశ్నిస్తున్న వైనం
- 42 రోజులుగా సమ్మె చేస్తున్నా పట్టించుకోని సర్కారు
- అణచివేతకే సర్కారు మొగ్గు..సడలని ధైర్యంతో వివఒలు ముందుకు
- వారి న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి పెరుగుతున్న మద్దతు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వ మొండి వైఖరితో విఒఎల పోరాటం తీవ్రరూపం దాల్చుతోంది. ఇన్ని రోజులు మండల, జిల్లా కేంద్రాలకే పరిమితమైన వారి పోరాటం పట్నం చేరుకుంటున్నది. రూ.3,900 వేతనంతో ఎలా బతకాలని ప్రశ్నిస్తూ 42 రోజులుగా ఐకేపీ విఒఎలు చేస్తున్న పోరాటం పట్ల ఎప్పట్లాగే రాష్ట్ర సర్కారు సమ్మెల పట్ల వ్యవహరిస్తున్న నిరంకుశ తీరునే ప్రదర్శిస్తున్నది. వారి న్యాయమైన డిమాండ్ల కోసం చేస్తున్న సమ్మెకు రోజురోజుకీ మద్దతు పెరుగుతున్నా సర్కారులో మాత్రం చలనం కరువైంది. బంతి గోడకేసి ఎంత గట్టిగా కొడితే అంతే తీవ్రతతో వెనక్కి వచ్చినట్టుగానే..రాష్ట్ర సర్కారు అణిచివేత, తీవ్ర నిర్బంధం, బెదిరింపులతో విసిగివేసారిన విఒఎలు తమ పోరాట ఉధృతిని మరింత పెంచుతున్నారు. అందులో భాగంగానే వారు సోమవారం నాడు చలో ఇందిరాపార్కు వద్ద మహాధర్నాకు పిలుపునిచ్చారు. వేలాది మంది విఒఎలు ఈ ధర్నాకు తరలివచ్చే ఏర్పాట్లను చేసుకున్నారు. అయితే, రాష్ట్ర సర్కారు ఎప్పట్లాగే విఒఎలను హైదరాబాద్‌కు రాకుండా సామదానదండోపాయాలను ప్రదర్శిస్తోంది. సర్కారు ఎన్ని కుట్రలు పన్నినా మహాధర్నాను విజయవంతం చేసి తమ పోరాటాన్ని రాష్ట్ర ప్రజలందరిలోకీ తెలిసేలా చేసేందుకు విఒలు కంకణబద్ధులై కదులుతున్నారు.

సమ్మెలోకి ఎందుకెళ్లారు?

రాష్ట్రంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్)లో గ్రామ స్థాయిలో 17,606 మంది వీఓఏలు (గ్రామ సంఘాల సహాయకులు) 19 ఏండ్ల నుంచి పనిచేస్తున్నారు. ఊర్లల్లో మహిళా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేస్తూ మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదగడానికి వారికి అవగాహన కల్పిస్తున్నారు. మహిళలు సొంతకాళ్లపై నిలబడేందుకు బ్యాంకుల ద్వారా తీసుకున్న లోన్లను సక్రమంగా చెల్లించడంలో వీరిదే కీలకపాత్ర. ఎవరైతే లోన్లు సరిగా కట్టరో వారి దగ్గరకెళ్లి అర్థమయ్యే రీతిలో వివరించి కట్టేలా చేస్తున్నారు. డ్వాక్రా మహిళా సంఘాలు నిర్వహిస్తున్న లావాదేవీలన్నీ పుస్తక నిర్వహణ చేస్తూ ఎస్‌హెచ్‌జి లైవ్ మీటింగ్ పెట్టి ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేస్తున్నారు. సంక్షేమపథకాలు ప్రజలకు అందడంలో తమ వంతు పాత్ర పోషిస్తున్నారు. సర్వేలలో వీరిని రాష్ట్ర ప్రభుత్వం వాడుకుంటున్నది. ఇంత కష్టపడుతున్నప్పటికీ విఒఎలకు సెర్ప్ నుంచి రూ.3,900 గౌరవ వేతనమే దక్కుతున్నది. ఎంతోమంది కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేసిన రాష్ట్ర సర్కారుకు 19 ఏండ్ల నుంచి పనిచేస్తున్న వీరు కనిపించకపోవడం బాధాకరం. అంత తక్కువ వేతనంతో బతకడం కష్టమవుతున్న నేపథ్యంలో తమను పర్మినెంట్ చేసి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని వీఓఏలు డిమాండ్‌ను తెరపైకి తెచ్చారు. అదే సమయంలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న పలు అంశాలనూ రాష్ట్ర సర్కారు దృష్టి తీసుకొచ్చి ప్రభుత్వాన్ని పలుమార్లు వేడుకున్నారు. అనేక పోరాటాలు చేశారు. అయితే, రాష్ట్ర సర్కారు మాత్రం వీరి విషయంలో సానుకూలంగా స్పందించలేదు. ఈ నేపథ్యంలోనే ఐకెపి విఒఎలు సమ్మెలోకి వెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులు, అణచివేత చర్యలు, బెదిరింపులకు పాల్పడినా విఒఎలు 42 రోజులుగా తమ పోరాటాన్ని కొనసాగిస్తూనే ఉన్నారు. ఏప్రిల్ 17 నుంచి నిరవధిక సమ్మెతో పాటు భిక్షాటనలు, రోడ్ల ఊడ్చటాలు, రిలే దీక్షలు, నిరసనలు, వంటావార్పు, జిల్లా కలెక్టరేట్ల వద్ద ధర్నాలు చేస్తూనే ఉన్నారు. కలెక్టరేట్ల ముట్టడి సందర్భంగా ముందస్తు అరెస్టులు, లాఠీ ఛార్జీలు చేయడం, మహిళలను మగ పోలీసులు పిడి గుద్దులు గుద్దడం లాంటి అమానుష చర్యలకు రాష్ట్ర సర్కారు పాల్పడింది.

గొంతెమ్మ కోరికలేం కాదు..పరిష్కరించాల్సిందే

'19 ఏండ్ల నుంచి పనిచేస్తున్న విఒఎలు తమను పర్మినెంట్ చేయాలని అడగటం నేరమా? రూ.3,900తో బతకలేం జీతం పెంచాలనటం తప్పా? అరకొర వేతనాలతో బతుకులీడుస్తున్న తమ కుటుంబాలకు ఆరోగ్య బీమా, సాధారణ బీమా సౌకర్యాలు అడగకూడదా? చిన్న సంస్థలో పనిచేస్తుంటే గుర్తింపుగా ఐడీ కార్డులిస్తున్న రోజులివి. 19 ఏండ్ల నుంచి పనిచేసేటోళ్లకు సెర్ప్ ఐడీ కార్డు ఇవ్వదా? అందరికీ నేరుగా ఖాతాల్లోనే వేతనాలు వేసినట్టుగానే తమకూ జీతాలు చెల్లించాలని అడగటం అన్యాయమా? రోజుకో కొత్త పని చేయిస్తూ వేధించడం సరిగాదు..తమకంటూ ఓ జాబ్ చార్టు ఇవ్వండి అని అడగటం కూడా తప్పా? ప్రమోషన్లు అడగటం, ఆన్‌లైన్ పనులు తమతో చేయించొద్దనటం న్యాయం కాదా? వీఓఏలు గొంతెమ్మకోరికలేం కోరట్లేదు. వారి డిమాండ్లన్నీ న్యాయబద్ధమైనవే. వాటిని పరిష్కరించాల్సిందే. లేకుంటే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తాం.'

ఎస్‌వి రమ, తెలంగాణ ఐకెపి విఒఎ ఉద్యోగుల సంఘం(సిఐటియు) గౌరవాధ్యక్షులు

సురవరం కులానికే పరిమితం కాదు.. ఆయన దేశానికే గర్వకారణం

- జయంతి వేడుకల్లో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కసిరెడ్డి వెంకట్‌రెడ్డికి పురస్కారం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సురవరం ప్రతాప్‌రెడ్డి ఒక కులానికే పరిమితమైన వ్యక్తికాదని, ఆయన దేశానికే గర్వకారణమని మంత్రి వి శ్రీనివాస్‌గౌడ్ కొనియాడారు. గోల్కొండ పత్రిక మాజీ సంపాదకుడు సురవరం ప్రతాప్‌రెడ్డి 127వ జయంతి సభను తెలంగాణ రాష్ట్ర భాషా సంస్కృతి శాఖ, సురవరం ప్రతాపరెడ్డి సాహిత్య వైజయంతి ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్ర భారతిలో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సురవరం ప్రతాపరెడ్డి చిత్ర పటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన పేరుతో ఏర్పాటు చేసిన పురస్కారాన్ని ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో సురవరం ప్రతాపరెడ్డి నాటకాన్ని రవీంద్ర భారతిలో ప్రదర్శిస్తామని అన్నారు.

తెలంగాణ ఏర్పడిన తర్వాత ఈ ప్రాంతానికి చెందిన వైతాళికులు, కవులు, సాహితివేత్తలు, కళాకారులు, సామాజిక వేత్తలను గుర్తించి వారి జయంతి, వర్ధంతులను అధికారికంగా నిర్వహిస్తున్నామన్నారు. వారు అందించిన సేవలను భవిష్యత్తు తరాలకు తెలియచెప్పేలా అధికారికంగా సాంస్కృతిక, సాహిత్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రతాపరెడ్డి చరిత్రను సమాజానికి తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సురవరం తన పుస్తకాలు, రచనల ద్వారా సమాజాన్ని చైతన్య పరిచారన్నారని వివరించారు. తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సురవరం ప్రతాపరెడ్డి కుమారుడు కృష్ణవర్ధన్, కపిల్ సురవరం, ట్రస్ట్ కార్యదర్శి పుష్పలత, తెలంగాణ సాహిత్య పరిషత్ ప్రజా సంబంధాల అధికారి డాక్టర్ చెన్నయ్యతోపాటు పలువురు కవులు, సాహితివేత్తలు పాల్గొన్నారు.

నైపుణ్యం, జిజ్ఞాస మేరకు కోర్సు ఎంచుకోవాలి

- ఆలోచనా శైలి, పోటీ సామర్థ్యం ముఖ్యమే...
- కాలేజీ ఎంపికలో తల్లిదండ్రులు జాగ్రత్త తీసుకోవాలి
- కెరీర్ కౌన్సెలర్, సైకాలజిస్ట్ మహీపతి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యార్థులు తమకున్న నైపుణ్యం, జిజ్ఞాస, ఆలోచనా శైలి, పోటీ సామర్థ్యం మేరకు కోర్సును ఎంపిక చేసుకుంటే దాన్ని ప్రేమిస్తారనీ, ఇష్టంగా పూర్తి చేస్తారని ప్రముఖ కెరీర్ కౌన్సెలర్, సైకాలజిస్ట్ మహీపతి శ్రీనివాసరావు తెలిపారు. ఎంసెట్-2023 విద్యార్థుల కోసం ఉత్తమ బ్రాంచ్‌ను, ఉత్తమ కాలేజీని ఎంపిక చేసుకోవడమెలా? అనే అంశంపై ఆదివారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు, తల్లిదండ్రులకు పలు ప్రశ్నలను వేసి వారి నుంచి సమాధానాలు చెప్పించి కెరీర్ ఎంపికలో ఏ విధంగా ఆలోచించాలనేది తెలిపారు. ఎక్కువ మంది ట్రెండింగ్, డిమాండ్, తమకు సరిపడే కోర్సు అంటూ ఎంపికకు వెళ్తున్నారని చెప్పారు. కోర్సులు తీసుకున్న వారిలో చాలా మంది తల్లిదండ్రులు చెప్పారనీ, స్నేహితులు తీసుకున్నారని అనే కారణంతో ఆయా కోర్సుల్లో చేరుతున్నట్టు తనతో చెప్పారని అనుభవాలను వివరించారు.

ప్రస్తుత విద్యార్థుల్లో ఎక్కువ మంది కంప్యూటర్ సైన్స్‌ను తీసుకుంటున్నారనీ, ఇందులో రాణించాలంటే మ్యాథమ్యాటిక్స్ ఫౌండేషన్‌తోపాటు లాజికల్ థింకింగ్ ఉండాలని సూచించారు. కంప్యూటర్ సైన్స్ అయితే సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు అర్హత పొందుతారనీ, కోర్ ఇంజినీరింగ్ కోర్సులైతే రెండింటిలోనూ అర్హత పొందే విషయాన్ని గమనంలో ఉంచుకోవాలని కోరారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఆయా కాలేజీల్లో చేర్చే ముందు వాటిని సందర్శించడం, చదవాలనుకున్న కోర్సుకు సంబంధించిన ల్యాబ్ సౌకర్యాలను పరిశీలించడం, ప్లేస్‌మెంట్ శాతం తెలుసుకోవడం, కాలేజీలకిచ్చే ఎన్‌ఆర్‌ఎఫ్, కోర్సులకిచ్చే ఎన్‌బీఏ ర్యాంకింగ్‌లను తెలుసుకోవాలన్నారు. ఈ ర్యాంకింగ్ లేనంత మాత్రాన మంచి కాలేజీలు కావు... అనుకోవడానికి వీల్లేదనీ, వీటికి దరఖాస్తు చేసుకునేందుకు ఆయా కాలేజీలు ప్రారంభమై ఆరేండ్లు పూర్తి కావడంతోపాటు దరఖాస్తు చేసుకుని ఉండాలని చెప్పారు. ర్యాంకింగ్‌ను ఒక అంశంగా మాత్రమే తీసుకోవాలేగానీ, అదే పూర్తి స్థాయి నిర్ణయం తీసుకునేందుకు ప్రాతిపదిక కాదని స్పష్టం చేశారు. ఆయా కాలేజీల్లో ఫిజికల్ యాక్టివిటీస్, ఆట స్థలం, అందుబాటులో ప్రాథమిక ఆస్పత్రి, రవాణా సౌకర్యం తదితర అంశాలతో పాటు కోర్సు పూర్తయ్యే సరికి ఎంత ఖర్చవుతుందో చూసుకోవాలని సూచించారు. ఎట్టి పరిస్థితిలో కన్సల్టెంట్ల ద్వారా కాలేజీలు, కోర్సులను ఎంపిక చేసుకోవద్దని హెచ్చరించారు. వీరిలో అత్యధిక మంది కేవలం విద్యార్థులు, కాలేజీలు ఇచ్చే డబ్బుల ఆధారంగానే మంచి కాలేజీ, మంచి కోర్సు అంటూ చెబుతుంటారని తెలిపారు.

బీ కేటగిరీ సీట్లను ప్రభుత్వమే భర్తీ చేయాలి

ఇంజినీరింగ్‌లో బీ కేటగిరీలో సీట్లను ప్రభుత్వమే భర్తీ చేయాలని శ్రీనివాసరావు కోరారు. లేకపోతే కేవలం ధనవంతుల పిల్లలకే సీట్లు దక్కి... పేద ప్రతిభావంతులైన విద్యార్థులు నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నవతెలంగాణ జనరల్ మేనేజర్ (హెచ్‌ఆర్) నరేందర్ రెడ్డి, నవీన్, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆదర్శవంత రాజకీయ సాహితీవేత్త సురవరం ప్రతాప రెడ్డి

- మంత్రి శ్రీనివాస గౌడ్

ప్రజాశక్తి - కల్చరల్

రాజకీయాలలో గానీ సాహిత్యం వ్యాసంగంలో కానీ సంస్కారవంత విమర్శలు వుండాలని రాజకీయ సాహితీవేత్తల జీవితాలు ఇతరులకు మార్గ దర్శనం కావాలని కోరుకున్న సురవరం ప్రతాప రెడ్డి నేటి వారికి అదర్శనీయులని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక శాఖా మంత్రి శ్రీనివాస గౌడ్ అన్నారు రవీంద్రభారతి ప్రధాన వేదికపై రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, సురవరం ప్రతాప రెడ్డి సాహిత్య వైజయంతి ట్రస్ట్ సంయుక్త నిర్వహణలో సురవరం ప్రతాప రెడ్డి బి127 వ జయంతి సభ జరిగింది. ముఖ్య అతిథిగా శ్రీనివాస గౌడ్ మాట్లాడుతూ ప్రతాప రెడ్డి రాజకీయాలలో కోనసాగి ఉంటే తెలంగాణ ప్రాంతానికి చెందిన తొలి ముఖ్యమంత్రి అయ్యే వారని మంచి సంస్కరణలు ప్రవేశ పెట్టేవారని అన్నారు అంబేద్కర్, చాకలి ఐలమ్మ, సురవరం ప్రతాప రెడ్డి పుచ్చలపల్లి సుందరయ్య లాంటి మెహనీయులు సమాజం కోసం పరి తపించారని విలువల కోసం జీవిత కాలం ప్రాకు లాడారని అన్నారు. నేడు రాజకీయాలలో వ్యసక్తి ఐదు గత దూషణలు సర్వ సాధారణమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ ఎల్లూరి శివా రెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడుతూ తెలుగు విశ్వవిద్యాలయంకు ప్రతాప రెడ్డి నామకరణం చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రతాప రెడ్డి రాసిన ఆంధ్రుల సాంఘీక చరిత్ర గొప్ప పరిశోధన గ్రంథం అన్నారు. అనంతరం ప్రతాప రెడ్డి సాహితీ వైజయంతి పురస్కారం ప్రముఖ సాహితీవేత్త ఆచార్య కసి రెడ్డి వెంకట రెడ్డికి లక్ష నగదుతో జ్ఞాపిక ప్రశంసాపత్రం బహుకరించారు ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె చెన్నయ్య స్వాగతం పలికిన సభలో కార్యదర్శి సురవరం పుష్పలత రెడ్డి, డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి, అనిల్ కుమార్ రెడ్డి, కపిల్, చరిత్ర పరిశోధకుడు శివనాగి రెడ్డి పాల్గొన్నారు

ఎన్టిఆర్‌కు ఘననివాళి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టిడిపి వ్యవస్థాపకులు, దివంగత మాజీ సిఎం నందమూరి తారక రామారావు శత జయంతి సందర్భంగా ఎన్టీఆర్ ఘాట్ వద్ద ఆయన కుటుంబసభ్యులు ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. ఎన్‌టిఆర్ తనయుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, మనవడు జూనియర్ ఎన్‌టిఆర్, నందమూరి రామకృష్ణ, సినీనటుడు రాజేంద్ర ప్రసాద్ తదితరులు ఎన్‌టిఆర్‌కు అంజలిఘటించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మీడియాతో మాట్లాడారు. ' ఎన్‌టిఆర్ శత జయంతిని తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా నిర్వహించుకుంటున్నాం. ఆయన సినిమాల్లోనే కాదు.. రాజకీయ రంగంలోనూ అగ్రగామిగా వెలుగొందారు. తెలుగు వారి రుణం తీర్చుకునేందుకు ఎన్‌టిఆర్ టిడిపిను స్థాపించారు. పార్టీని అధికారంలోకి తీసుకొచ్చి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారు. ఆయన తీసుకొచ్చిన రెండు రూపాయలకు కిలో బియ్యం పథకం నేడు ఆహార భద్రతగా మారింది. మహిళలకు ఆస్తి హక్కు తదితర చరిత్రాత్మక నిర్ణయాలను ఆయన తీసుకున్నారు. జాతీయ రాజకీయాల్లో ఎన్‌టిఆర్ కీలక పాత్ర పోషించారు. ఆయన కుమారుడిగా జన్మించడం నా అదృష్టంగా భావిస్తున్నా' అని బాలకృష్ణ అన్నారు.

ఎన్‌టిఆర్ వల్ల రాజకీయ రంగంలోకి వచ్చిన విద్యా వంతులు

ప్రజాశక్తి - కల్చరల్

నందమూరి తారక రామారావు తెలుగు దేశం పార్టీ పెట్టి ఎందరో విద్యావంతులను రాజకీయ రంగంలోకి తీసుకు వచ్చారని రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ అన్నారు. అవినీతికి అస్కారం లేని రాజకీయాలు కావాలని ఎన్‌టిఆర్ ఆకాంక్ష అని అందుకే విద్యావంతులు మేధావులను పార్టీ టికెట్ ఇచ్చి ప్రోత్సాహించారని ఆయన గుర్తు చేశారు. శ్రీ త్యాగరాయ గాన సభలోని కళా సుబ్బారావు కళా వేదికపై గాన సభ నిర్వహణలో జరుగుతున్న ఎందరో మహనుభావులు కార్యక్రమాలలో భాగంగా విఖ్యాత నటుడు పూర్వ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు శత జయంతి సమావేశం జరిగింది.ముఖ్య అతిథిగా దామోదర్ పాల్గొని మాట్లాడుతూ నేడు రాజకీయలో ఉన్న ఎందరో ప్రముఖులకు ఎన్‌టిఆర్ ప్రేరణ అన్నారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఎన్‌టిఆర్ సినీ రంగం లో కానీ రాజకీయ రంగంలో నైనా ఒక సంచలనం ఒక ప్రభంజనం అని అన్నారు గాన సభకు ముఖ్య మంత్రి పదవిలో వున్నప్పుడు లేని సమయంలోను సాంస్కృతిక సంస్థల కార్యక్రమాలకు అతిథిగా వచ్చారని గుర్తు చేసుకొన్నారు. వేదిక పైనాట్య గురువు డాక్టర్ భారతి, నైషధం సత్యనారాయణ మూర్తి పాల్గొన్నారు

తమ్ముడిని హత్య చేసిన అన్న

- ఆస్తి తగాదాలే కారణం?
- కార్యకర్త పాడే మోసిన ఎమ్మెల్యే హనుమంతు షిండే

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తమ్ముడిని అన్న హత్య చేసిన సంఘటన కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలం సోనాల గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున జరిగింది. మద్నూర్ ఎస్‌ఐ కృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సోనాల గ్రామానికి చెందిన టాక్లే విజయ్ (32)ను ఆస్తి తగాదాల కారణంతో అతని అన్న తాకలే రాజు కత్తితో పొడిచి కిరాతంగా హత్య చేశాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ కృష్ణారెడ్డి, బిచ్కుంద సిఐ కృష్ణ, బాన్సువాడ డిఎస్‌పి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. హత్యకు గురైన టాక్లే విజయ్ సోనాల బిఆర్‌ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు. ఆయన హత్య విషయాన్ని తెలుసుకున్న జుక్కల్ ఎమ్మెల్యే హనుమంతు షిండే హుటాహుటినా సోనాల గ్రామానికి చేరుకున్నారు. హత్య గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన అంత్యక్రియల్లో పాల్గొని విజయ్ పాడేను మోశారు.

కన్నతల్లిని కొట్టి చంపిన కుమార్తె

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిజామాబాద్ జిల్లా నందిపేట్ మండలంలో దారుణం జరిగింది. కుటుంబ కలహాలతో కన్నతల్లిని రోకలిబండతో కుమార్తె కొట్టి చంపిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. ఉమ్మెడ గ్రామానికి చెందిన నాగం నర్సు (52) కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తోంది. ఆమె భర్త 20 ఏళ్ల క్రితం చనిపోవడంతో ఉమ్మెడ గ్రామంలో ఒంటరిగా ఉంటోంది. ఆమె ఇంట్లోనే ఒక గదిలో కుమార్తె నాగం హరిత (28) వేరుగా ఉంటోంది. తల్లి, కుమార్తె మధ్య గత కొన్నేళ్లుగా కుటుంబ విషయాల్లో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఈ నెల 26న మధ్యాహ్నం నాగం నర్సు రెండో కుమార్తె అరుణ ఇంట్లో జరిగిన ఫంక్షన్‌కి వచ్చిన వారిని ఆమె దుర్భాషలాడింది. ఆ విషయంలో నాగం నర్సుకి, పెద్ద కుమార్తె హరితకు గొడవ జరిగింది. ఈ గొడవలో తల్లిని రోకలి బండతో తల, ముఖంపై కొట్టి పడేసి వెళ్ళిపోయింది. మరుసటి రోజు ఈ విషయాన్ని తన చెల్లెలికి, బంధువులకు ఫోన్ చేసి చెప్పింది. దీంతో నర్సు రెండో కుమార్తె, బంధువులు వచ్చి చూడగా ఆమె చనిపోయి ఉంది. మృతురాలి మేనల్లుడు గణపురం రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కాటన్ మిల్లులు కనుమరుగు

- ఉమ్మడి జిల్లాలో అమ్మకానికి ఎనిమిది మిల్లులు
- రోడ్డున పడుతున్న వేలాది మంది కార్మికులు
- చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ప్రోత్సాహం కరువు
- కేంద్ర ప్రభుత్వ సాయం అందక ఇబ్బందుల్లో యాజమాన్యాలు
- జిల్లాలో కుంటుపడిన పారిశ్రామిక అభివృద్ధి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధి పాతాళానికి పడిపోతున్నా పట్టించుకునే నాథుడే లేకుండాపోయాడు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలలో ప్రధానమైన కాటన్ పరిశ్రమలు వరుసగా మూత పడుతున్నా.. ప్రభుత్వానికిగానీ, అధికారులకుగానీ చీమకుట్టినట్టు అయినా లేదు. వేలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. బడా కార్పొరేట్ల కోసం పరితపిస్తున్న ప్రభుత్వాలు వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న చిన్న, మధ్యతరహా పరిశ్రమల గురించి పట్టించుకోని దుస్థితి నెలకొంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 50కి పైగా కాటన్ మిల్లులు జిన్నింగ్ మిల్లులు, సుమారు 30 విత్తన కంపెనీలు నడుస్తున్నాయి. ఈ 80 మిల్లులకు గాను ఇప్పటికే సగం మూతబడ్డాయి. నాగర్ కర్నూల్‌లో రెండు, కల్వకుర్తిలో ఐదు, అచ్చంపేటలో ఒక జిన్నింగ్ మిల్లు మూతపడే దశకు వచ్చాయి. ఇప్పటికే పది జిన్నింగ్ మిల్లులకు పైగా అమ్మకానికి పెట్టేందుకు యాజమాన్యాలు సిద్ధమవుతున్నాయి. చేనేత జిల్లా అయిన గద్వాల జిల్లాలో జిన్నింగ్ మిల్లులు అత్యధికంగా ఉన్నాయి. వాటి ద్వారా ప్రత్యక్షంగా పది వేల మందికి, పరోక్షంగా 25 వేల మందికి ఉపాధి లభిస్తోంది. దాంతో ఇక్కడ వ్యాపారాలు బాగా విస్తరించాయి. విత్తన పత్తితోపాటు దూది పత్తి ఈ ప్రాంతంలో దిగుబడి బాగా వస్తుండటంతో ఇక్కడి కాటన్ పరిశ్రమలు గతంలో లాభాలతో కొనసాగేవి. రోజుకు రెండు షిఫ్టుల్లో కూలీలు పనిచేసేవారు. కానీ నేడు పత్తి దిగుబడి తగ్గడంతో మిల్లులు నడవక కూలీలు వీధిన పడ్డారు. వేలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాగర్ కర్నూల్ జిల్లాలో 17 జిమ్మింగ్ మిల్లులు ఉన్నాయి. వర్షాలు అనుకూలంగా వచ్చి సరైన దిగబడి వస్తే సెప్టెంబర్ వరకు మిల్లులు నడవాలి. ఈసారి జనవరి నాటికే మిల్లులు ఆగిపోయాయి. ఇంద్రకల్ దగ్గర ఉన్న జగదాంబ కాటన్ మిల్‌లో పత్తి లేక ధాన్యాన్ని నిల్వ చేశారు. 70 వేల బెల్ల దిగుబడి రావాల్సి ఉండగా ఈసారి కేవలం 6000 బేల్లు మాత్రమే వచ్చాయి. పత్తి సాగు పెరిగినా దిగుబడి తగ్గడంతో అటు రైతులు ఇటు కాటన్ మిల్లుల యాజమాన్యాలు నష్టపోతున్నారు. ఈ మిల్లులో ఏటా 150 మంది కార్మికులు ఉండాల్సి ఉండగా ఎనిమిది మంది మాత్రమే పని చేస్తున్నారు. మిగతా వారంతా హైదరాబాద్‌లో అడ్డా కూలీలుగా మారారని తెలుస్తోంది. వనపర్తి కాటన్ మిల్లుల పరిస్థితి ఇదే. ప్రభుత్వం ఆదుకోకపోతే పరిశ్రమలన్నీ మూతబడి ఉపాధి లేకుండా పోతుందని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లేకనే మూత

కార్పొరేట్ బడా పారిశ్రామికవేత్తలకు మడుగులొత్తుతున్న ప్రభుత్వాలు చిన్న, మధ్యతరహా పరిశ్రమల గురించి ఏమాత్రం ఆలోచించడం లేదు. కరోనా ప్రభావం చిన్న, మధ్యతరహా పరిశ్రమలపై తీవ్రంగా పడటంతో యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిశ్రమలను కాపాడేందుకు ప్రభుత్వం ఎటువంటి చర్యలూ చేపట్టలేదు. వరుసగా పరిశ్రమలన్నీ మూతపడటంతో జిల్లాలో పారిశ్రామికాభివృద్ధి పూర్తిగా కుంటుపడింది. పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వ సహకరిస్తుందని, స్థానికులకే 75 శాతం ఉద్యోగాలు అంటూ ఊదరగొట్టడం తప్ప ఆచరణలో మాత్రం పట్టించుకోని పరిస్థితి. దాంతో ఉపాధిపై తీవ్ర ప్రభావం పడింది. ఇప్పటికైనా జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు మూతపడిన పరిశ్రమలన్నింటినీ తెరిపించాలని పలువురు కోరారు.

మాకు బతుకు తెరువు లేకుండా పోయింది

మేము పదేండ్లుగా కాటన్ మిల్లులో పనిచేస్తున్నాం. బీహార్ నుంచి వచ్చిన మాకు మిల్లులే ఉపాధి చూపించాయి. ఇప్పుడు కాటన్ మిల్లులో పత్తి లేకపోవడం వల్ల మాకు పని లేకుండా పోయింది.

లక్ష్మణ్, కాటన్ మిల్లు కూలీ

పావలా వడ్డీ అవకాశం కల్పించాలి

రైతులతో అనుబంధంగా ఉండే కాటన్ మిల్లులను ప్రభుత్వం ఆదుకోవాలి. ముఖ్యంగా కార్పొరేట్ కంపెనీల మాదిరిగా యాజమాన్యాలకు సబ్సిడీలు అందజేయాలి. విద్యుత్ బకాయిలను మాఫీ చేయడం ద్వారా కాటన్ మిల్లులను నిలబెట్టాలి. గ్రామపంచాయతీ టాక్స్‌తో పాటు ప్రభుత్వ పన్నులను నిలిపేయాలి.

రవికుమార్, కాటన్ మిల్ యజమాని ఇంద్రకల్